సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



వెండి కిరీటం సమర్పణ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామ లింగేశ్వరస్వామికి బోనగిరి వెంకట శివరామప్రసాద్ కుటుంబసభ్యులు (పాలకొల్లు) 1.150 కిలోల వెండి కిరీటాన్ని సమర్పించారు.



ఉద్యాన వర్సిటీలో హిందీ క్లబ్

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీలో హిందీ క్లబ్‌ను గురువారం వీసీ టి.జానకీరామ్ ప్రారంభించారు. హిందీ ఆవశ్యకతను వివరించారు.



వాహన తనిఖీలు

ఆకివీడు: ఆకివీడులో సహాయ రవాణా అధికారి ఎస్.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సులు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

బీసీలకు అగ్రతాంబూలం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సాక్షి, భీమవరం: వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యమివ్వడంలో వైఎస్సార్ సీపీ ముందు వరుసలో ఉందని మరోసారి రుజువైందని డీసీఎంఎస్ చైర్మన్, గౌడసమాఖ్య (ఐదు కులాల) జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి అన్నారు. భీమవరంలోని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో బీసీ సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 18 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా 14 పదవులను బీసీలకు కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం జగన్ బీసీల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలోని బీసీ కులాలంతా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు, లోకేష్ మాటలను నమ్మవద్దని టీడీపీ హయాంలో బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప ఎటువంటి అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. భీమవరం జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నర్సింహరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, నాయకులు కోడే యుగంధర్, తిరుమాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి సాయం



సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: ఏఎంఎల్ కేన్సర్‌తో బాధపడుతున్న తణుకు పైడిపర్రుకు చెందిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని జెట్టిబోయిన రేణుక వైద్య ఖర్చులకు వైఎస్సార్ సీపీ అభిమాని కేశిరెడ్డి గంగాధర్ రూ.లక్ష ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఆమె కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతోంది. వైద్యానికి రూ.60 లక్షలు అవసరం కాగా.. గంగాధర్ స్పందించారు. ఈ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు చీర్ల రాధయ్య చేతులమీదుగా రేణుకకు అందజేశారు.

ఉత్సాహంగా ఉల్కాన్‌జీ



నిట్‌లో సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో ఉల్కాన్‌జీ ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టులు, ఫన్నీగేమ్స్, త్రీడీ చిత్రాలు, లేజర్ టగ్ వంటివి ఆకట్టుకున్నాయి. దేశం గర్వించేలా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు చేపట్టాలని నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రమోద్ పడోలే విద్యార్థులకు సూచించారు. నిట్ ప్రాంగణంలో సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌కి చెందిన మొబైల్ వాహనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కొత్త ఆలోచనలు విజయానికి దిక్సూచి వంటివన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విభిన్న ప్రాజెక్టులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. రాకెట్ల పనితీరుపై వివరించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ తలారీ రేష్మా, ఆచార్యులు వి.సందీప్, టి.రమేష్, హైమావతి, సంధ్యారాణి పాల్గొన్నారు.

బైజూస్ వినియోగం భేష్



యాప్ పనితీరును పరిశీలిస్తున్న పీఓ

ఆకివీడు: విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేసి బైజూస్ యాప్ వినియోగం అద్భుతంగా ఉందని, విద్యార్థులకు అవగాహన పెరిగిందని సర్వశిక్షా అభియాన్ పీఓ పి.శ్యామ్‌సుందర్ అన్నారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగాన్ని గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి యాప్‌పై ఆరా తీశారు. ట్యాబ్‌లో పరీక్షల రాసే విధానాన్ని 10వ తరగతి విద్యార్థులు ఆయనకు వివరించారు. విద్యార్థులు పరీక్షలపై భయాన్ని పోగొట్టుకోవాలని ఆయన సూచించారు. తొలుత భవిత కేంద్రం, ఎంపీపీ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఏపీఎం, విద్యా సంక్షేమ సహాయకురాలు, సీఆర్‌పీ ఆయన వెంట ఉన్నారు.

పచ్చ రాతలపై మండిపాటు



ఏలూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా, కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, పార్టీ నేత జయమంగళ వెంకటరమణ

- చంద్రబాబువి నీచ రాజకీయాలు
- 'ఈనాడు'వి అసత్య కథనాలు
- రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు
- ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు

ఏలూరు టౌన్: గన్నవరంలో టీడీపీ నాయకుడు పట్టాభితో నీచ రాజకీయాలు చేయించి చంద్రబాబు కుట్రలకు తెరలేపుతున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించే నైతిక హక్కు చంద్రబాబుకు లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈనాడు అసత్య కథనాన్ని ప్రచురించడం సరికాదని ధ్వజమెత్తారు. ఏలూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా (చింతలపూడి), కొఠారు అబ్బయ్యచౌదరి (దెందులూరు), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), దూలం నాగేశ్వరరావు (కైకలూరు), మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ రమణ విలేకరులతో మాట్లాడారు.

ఓర్వలేక కుతంత్రాలు

40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రానికి శనిలా దాపురించారు. సీఎం జగన్ మంచి చేస్తుంటే ప్రజలకు ఏమార్చటానికి కుతంత్రాలు చేస్తున్నారు. గన్నవరంలో గొడవలు సృష్టించి చంద్రబాబు డైవర్షన్ పాలసీ అమలు చేస్తున్నారు. సీఎం జగన్ సామాజిక న్యాయం పాటిస్తూ 14 ఎమ్మెల్సీ స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా ముఖ్యమంత్రి సామాజిక న్యాయం చేస్తుంటే కడుపుమండుతుందా బాబూ. మీ దుష్ట చతుష్టం కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారు. రాబోయే కాలంలో గట్టిగా బుద్ధి చెబుతారు.

–వీఆర్ ఎలీజా, ఎమ్మెల్యే, చింతలపూడి

సంక్షేమ పాలన కనిపించదా..

చంద్రబాబు, లోకేష్ తప్పుడు ప్రచారాలు చేస్తూ అనైతిక రాజకీయాలు చేయడం దారుణం. లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి. డీఎస్పీ స్థాయి అధికారిని ఏకవచనంతో సంబోధించిన చంద్రబాబుది నీచ సంస్కృతి. రాష్ట్రంలో సంక్షేమ పాలన ఎల్లో మీడియాకు కనిపించడం లేదు. సీఎం జగన్ ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. లోకేష్‌కు పాదయాత్రలో టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తుందో చెప్పే దమ్ములేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో దేశంలోనే ఏపీ నెంబర్ 1గా నిలిచింది. రాష్ట్రంలో 1.45 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు స్టేట్ ఇన్వెస్టిమెంట్ బోర్డు ఆమోదం తెలిపిన విషయం ప్రతిపక్షాలకు కనిపించడం లేదు.

– కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

బాబు చేసిందేమీ లేదు

చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిందేమీ లేదు. 14 ఏళ్లు సీఎంగా చేసినా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పుడు విమర్శలకు, కుట్రలకు పరిమితం కావడం దారుణం. గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించేలా సీఎం జగన్ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 90 శాతం హామీలను అమలు చేశారు. మిగిలిన వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. అవినీతికి తావులేకుండా పథకాలను అందిస్తున్నారు. కొల్లేరు భూములను రీసర్వే చేయించి, పేదలకు న్యాయం చేస్తానన్నారు. పెద్దింట్లమ్మ గుడి వద్ద వారధి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మాట ఇస్తే నిలబెట్టుకోవాలనే విషయం చంద్రబాబు తెలుసుకోవాలి.

– దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్యే, కైకలూరు

నీదీ అనే ఒక్క పథకం ఉందా..

2019కి ముందు.. ప్రస్తుతం రాష్ట్రంలో ఏం జరిగిందో స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్నికల మేనిఫెస్టోలను ప్రజలకు చూపించి ఏం చేశారో చెప్పే ధైర్యం చంద్రబాబుకు లేదు. బాబు హయాంలో బడులు మూసివేస్తే జగనన్న హయాంలో పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి చేరాయి. అసలు నాది అని చెప్పుకునే ఒక్క పథకం పేరు చంద్రబాబు చెప్పగలరా. లోకేష్ పాదయాత్రకు సీఎం జగన్ పాదయాత్రకు చాలా తేడా ఉంది. టీడీపీ నాయకుడు పట్టాభిని కొట్టారంటూ ఈనాడు పత్రిక అసత్య ప్రచారం చేయటం సరికాదు. విలువలతో పనిచేసే పరిస్థితి నుంచి ఇలా దిగజారటం ఎందుకో అర్థం కావడం లేదు.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

మోసకారి చంద్రబాబు

సుదీర్ఘకాలం టీడీపీలో కొనసాగాను. 2009లో టీడీపీ జెండా ఎగురవేసేలా చేశాను. అయినా తన కులం వారితో చంద్రబాబు నన్ను మోసం చేశారు. 2014లో నామినేషన్ వేసిన అనంతరం నన్ను బరిలో లేకుండా తప్పుకోవాలనీ, మొదటి ఎమ్మెల్సీ నీకే ఇస్తానని నమ్మించి మోసం చేశారు. బీసీలను మోసం చేసిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు మాత్రమే. అయితే సీఎం జగన్ వడ్డీల కులం నుంచి నాకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే. కొల్లేరు సమస్యలను సైతం పరిష్కరించేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారు.

– జయమంగళ వెంకట రమణ, మాజీ ఎమ్మెల్యే

జనాగ్రహం

భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



తణుకు నరేంద్ర సెంటర్‌లో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద..



తాడేపల్లిగూడెంలో నిరసన

తణుకు అర్బన్/పాలకొల్లు అర్బన్: టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టారంటూ ఈనాడు పత్రిక తప్పుడు కథనం ప్రచురించడంపై జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఈనాడు అధినేత రామోజీరావు పాత చిత్రాలను కొత్తవిగా చూపించే ప్రయత్నంలో జర్నలిజం విలువలను దిగజార్చారని మండిపడ్డారు. తప్పుడు రాతలకు నిరసనగా గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈనాడు పత్రికలను దహనం చేశారు. తణుకు నరేంద్ర సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వేలూర్పులో పార్టీ నేత పోలేపల్లి వెంకట ప్రసాద్, ఇరగవరంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన తెలిపారు. పాలకొల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, ఆచంటలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనాడు పత్రికలను దహనం చేశారు. తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, కొయ్యలగూడెంలో మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల పరిశీలకుడు సురేష్‌కుమార్



ఏలూరు జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తున్న పరిశీలకుడు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల పరిశీలకుడు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన జిల్లాలో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ పి.అరుణ్‌బాబుతో కలిసి ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆయనతో ఏర్పాట్లపై చర్చించారు. మొత్తంగా 856 మంది ఎంపీటీసీలు, 48 మంది జెడ్పీటీసీలు, 180 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, 21 మంది ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిసి 1,105 మంది ఓటర్లు ఉన్నారని, 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ పశ్చిమగోదావరిలో ప్రశాంతంగా ఎన్నికలు జరగడం ఆనవాయితీ అని, ఈ మేరకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 27 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. వచ్చే నెల 13న పోలింగ్, 16న కౌంటింగ్ ఉంటుందన్నారు.

15 నామినేషన్‌లు దాఖలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం తొమ్మిది నామినేషన్‌లు దాఖలయ్యాయని జేసీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు తెలిపారు. మొత్తంగా 8 మంది అభ్యర్థులు 15 నామినేషన్లను దాఖలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి వంకా రవీంద్రనాథ్ (తణుకు) 3 సెట్లు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ 3 సెట్లు, వంకా రాజకుమారి 1 సెట్, టీడీపీ నుంచి వీరవల్లి చంద్రశేఖర్ 2 సెట్లు, స్వతంత్ర అభ్యర్థులు నల్లి రాజేష్ 3 సెట్లు, పసల వెంకటాచలం 1 సెట్, గోరింక దాసు 1 సెట్, దేవరపల్లి ఆదాం 1 సెట్ దాఖలు చేశారన్నారు. నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల పరిశీలకుడు సురేష్‌కుమార్ పరిశీలించారు.

ప్రతిష్టాత్మకంగా రీ సర్వే



రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఉండి: వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీ సర్వే ప్రతిష్టాత్మకంగా, దేశంలో ఎక్కడా లేనివిధంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం ఉప్పులూరులో రీ సర్వే ప్రక్రియను ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజుతో కలిసి ఆమె పరిశీలించారు. రైతులకు సంబంధించిన భూసమస్యల పరిష్కారానికి రీసర్వే దోహదపడుతుందన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారన్నారు. ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో భూమి లెక్కలు, హక్కుదారుల పేర్లు నిర్ధారిస్తామన్నారు. జిల్లా సర్వేయర్ కె.జాషువా, తహసీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ అప్పారావు ఉన్నారు.

వచ్చేనెలాఖరు నాటికి..

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం డివిజన్‌లో చేపట్టిన రీ సర్వే పనులను వచ్చేనెలాఖరు నాటికి పూర్తిచేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వెలగపూడి సచివాలయం నుంచి ఏపీ భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి ఆమె హాజరయ్యారు. డివిజన్‌లో 128 గ్రామాలకు గాను 47 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు 94 గ్రామాల్లో పూర్తయ్యాయని, సర్వే హద్దు రాళ్లు 10 వేలు వచ్చాయని అన్నారు.

రోడ్ల నిర్మాణాలపై..

ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను వచ్చేనెలాఖరు నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. రోడ్డు ప్రమాణాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు తదితర భవన నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు.

అగ్రిగోల్డ్ కేసు విచారణ ప్రారంభం

ఏలూరు (టూటౌన్): అగ్రిగోల్డ్ కేసు విచారణ ఏలూరులోని ప్రత్యేక న్యాయస్థానంలో గురువారం ప్రారంభమైనట్టు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు తెలిపారు. ఈ కేసులో తొలిసారిగా బాధితుల తరఫున కోర్టులో చర్చ జరగడం శుభ పరిణామంగా భావిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటక అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ నాయకులు, న్యాయవాది కె.నాగభూషణరావు, ఏపీ న్యాయవాది పీఎస్ చందు బాధితుల తరఫున హాజరయ్యారు. సుమారు 30 నిమిషాల పాటు వాదనలు వినిపించారు.

క్లుప్తంగా

తండ్రికి కొరివి పెట్టిన తనయ



తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న కుమార్తె కొండేటి లక్ష్మి

నరసాపురం రూరల్: పున్నామ నరకం నుంచి తప్పించేందుకు కూతురైతేనేమి అంటూ కన్న తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుందో కూతురు. వివరాల్లోకి వెళితే.. నరసాపురం మండలం సీతారామపురం నార్త్ గ్రామంలో కొబ్బరి కార్మికునిగా జీవనం సాగించే కొండవీటి శ్రీనివాసు (50) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఇతనికి భార్య వెంకటరమణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా ఇంటర్ చదువుతున్న చిన్న కుమార్తె కొండేటి లక్ష్మి తండ్రి ఆకస్మిక మరణంతో ఉబికివస్తున్న దుఖాన్ని దిగమింగుకుని తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. చురుగ్గా అందరితో కలివిడిగా నవ్వుతూ మాట్లాడుతూండే శ్రీనివాస్ ఆకస్మిక మరణించడంతో ఆకుంబ సభ్యులు పడుతున్న రోదనలు మిన్నంటాయి.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

- 22 కిలోల గంజాయి స్వాధీనం
- తణుకులో ఎస్పీ రవిప్రకాష్ వెల్లడి



తణుకులో విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

తణుకు: తణుకులో అక్రమంగా గంజాయి తరలిస్తూ కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను గురువారం తణుకు పోలీసులు అరెస్టు చేశారు. ఇరగవరం రోడ్డు కాలనీకు చెందిన కరుపోతు తరుణ్కుమార్ అనే పండు, సజ్జాపురం ప్రాంతానికి చెందిన పంపిరెడ్డి శ్యామ్కుమార్ అలియాస్ శ్యామ్సింగరాయ్ అలియాస్ శ్యామ్తోపాటు మరో బాలుడిని అరెస్టు చేసి వారి నుంచి 22.125 కిలోల గంజాయి, ఒక బైక్, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం తణుకు పట్టణ పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ వివరాలు వెల్లడించారు. నిందితులు పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చి స్థానికంగా యువకులను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, రూరల్ ఎస్సై కె.గుర్రయ్య నిఘా ఉంచారు. గురువారం పట్టణ పరిధిలోని జాపాన్ కాలనీ శివారులో నిందితులు ప్లాస్టిక్ సంచులతో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారి వద్ద 22.125 కిలోల గంజాయి, సుజుకి గిక్సర్ బైక్తోపాటు మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.2.30 లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేసులో సహకరించిన సీఐ ఆంజనేయులు, ఎస్సై గుర్రయ్య, ఏఎస్సై పోలయ్యకాపు, హెచ్సీ ఏవీఎస్ఎస్ రాజు, కానిస్టేబుళ్లు తానేటి రవి, ఎం.లక్ష్మణరావు, ఎం.శివాజీ, ఎం.మురళి, జి.గోవింద్లను ఎస్పీ రవిప్రకాష్ అభినందించారు.

ఇకపై హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు

తణుకు: రోడ్డు ప్రమాదాల్లో 60 శాతం మంది హెల్మెట్ ధరించకపోవడంతో తలకు గాయాలై మృత్యువాత పడుతున్నారని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వేల్పూరు రోడ్డులో నిర్వహించిన హెల్మెట్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అవగాహనలు కల్పించామని ఇకపై హెల్మెట్ వినియోగించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా హెల్మెట్ వినియోగిస్తున్న ద్విచక్ర వాహనదారులను అభినందించారు. తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, ట్రాఫిక్ ఎస్సై జానా సతీష్, రూరల్ ఎస్సై కె.గుర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డనపూడిలో చైన్ స్నాచింగ్

కాళ్ల: వాకింగ్ చేస్తున్న ఓ వివాహిత మెడలో బంగారు గొలుసును ఓ గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుని పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల గ్రామానికి చెందిన పోడూరి సుబ్రహ్మణ్యేశ్వరి తన భర్త రామదేవ త్రిమూర్తులతో కలిసి ప్రతిరోజు ఉదయం కాళ్ల హైస్కూల్ నుంచి వాకింగ్ చేస్తుంటారు. గురువారం ఉదయం కూడా వాకింగ్ చేస్తుండగా, దొడ్డనపూడి పరిధిలోని కచ్చా గరువువద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి సుబ్రహ్మణ్యేశ్వరి మెడలోని రెండు కాసుల బంగారపు నానుతాడు తెంచుకుని పరారయ్యాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఏజీఏఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ (ఆచంట): ఆచంట మండలం దొడ్డివారిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ను అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- రెండు ఘటనల్లోనూ బైక్లను ఢీకొన్న లారీలు
- రామచంద్రపురం వద్ద పెళ్లికి వెళుతూ వ్యక్తి..
- ప్రత్తిపాడు వద్ద ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తూ మహిళ ఘటనాస్థలంలోనే మృతి





రామచంద్రపురంలో ప్రమాదం తీరును పరిశీలిస్తున్న ఎస్సై జి.సత్యనారాయణ, శ్రీనివాసరావు (ఫైల్)





ప్రత్తిపాడు వద్ద ప్రమాదంలో నుజ్జు అయిన మహిళ మహాలక్ష్మి (ఫైల్)

పెంటపాడు : మండలంలో గురువారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మండలంలోని రామచంద్రపురం శివారులో లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందగా, ప్రత్తిపాడు జాతీయ రహదారి వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామానికి చెందిన పంపన శ్రీనివాసరావు (45) గణపవరం మండలం డి.కుముదవల్లిలో జరిగే వివాహానికి మోటార్ సైకిల్పై వెళుతున్నాడు. రామచంద్రపురం శివారు మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని లారీ నితనిని వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మీనవిల్లూరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు చింతపల్లి శ్రీనివాస్, తిరుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పంపన బుజ్జి, గ్రామ వీఆర్వో చిలకా శ్రీనివాసరావు సాయంతో పెంటపాడు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాసరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా పెళ్లిలో వారిని దిగబెట్టి తిరిగి వేడుకకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో ఘటనా స్థలం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రత్తిపాడు వద్ద..

తాడేపల్లిగూడెం మండలం కడియద్దకు చెందిన తోట మహాలక్ష్మి (67) తన భర్త నాగేశ్వరరావుతో మోటార్సైకిల్పై తణుకు ఆసుపత్రికి వెళ్లి, తిరిగి స్వగ్రామం బయలుదేరారు. ప్రత్తిపాడు వద్ద జాతీయరహదారి దిగుతుండగా ఏలూరు నుంచి తణుకు వైపు వెళుతున్న గుర్తుతెలియని లారీ ఎదురుగా వేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహాలక్ష్మిపై నుంచి వెళ్లిన లారీ కొంత దూరం ఆమె ఈడ్చుకుపోగా మృతదేహం నుజ్జు అయ్యింది. భర్త నాగేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై జి.సత్యనారాయణ రెండు ప్రమాదాలను పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో 10 మందికి గాయాలు



తణుకు ప్రభుత్వాసుపత్రిలో బాధితురాలికి చికిత్స అందిస్తున్న వైద్యులు

తణుకు: మండపాకలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. గత పది రోజులుగా ఇళ్లల్లోకి చొరబడి మరీ మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడి చేస్తుండటంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం గ్రామానికి చెందిన పలువురు మహిళలు తీవ్ర గాయాలతో తణుకు ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. అకస్మాత్తుగా దాడి చేస్తున్న కోతులు శరీరంపై కండలు పీకేస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన శిరిగిన హైమావతి, అర్తి వరలక్ష్మి, బొర్రా గంగరాజు, ఆత్మకూరి రత్నం, దొంగ లక్ష్మి, చినవెంకన్న, గరపతి వెంకటలక్ష్మిలతోపాటు చిన్నారులు అవినాష్ తేజ, రోహిత్కృష్ణ, లాస్యశ్రీలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అధికారులు చర్యలు తీసుకుని కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 2,077 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం బ్రిడ్జికోర్సు ఒకేషనల్ విద్యార్థులకు జరిగిన ప్రయోగ పరీక్షల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 18 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు మొత్తం 1,030 మంది హాజరయ్యారు. పరీక్షకు 1,202 మంది హాజరు కావాల్సి ఉండగా 172 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు చెప్పారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీగా రవీంద్రనాథ్ ఎంపికపై అభినందనలు



రవీంద్రనాథ్ తల్లి నాగమణిని సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్ సభ్యులు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎంపికైన సందర్భంగా ఆయన మాతృమూర్తి వంక నాగమణిని తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలసి అభినందనలు తెలిపారు. గురువారం సాయంత్రం తణుకులోని నాగవిహార్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సభ్యులు రవీంద్రనాథ్ తల్లి నాగమణిని కలసి శాలువాలు కప్పి, పుష్ప గుచ్చాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కేవీ సత్యనారాయణ, డాక్టర్ బొండాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చింతపల్లిలో నూతన చర్చి ప్రారంభం

పెంటపాడు: చింతపల్లి గ్రామంలో గురువారం పరిశుద్ధ సహవాస ప్రార్థనామందిరం పేరిట నూతన చర్చిని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘకాపరి యుపీఎఫ్ సంఘ సభ్యులు, తిప్పరాల అబ్రహాం, చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనా కార్యక్రమం నిర్వహించారు. దైవసేవకులు ఎం సత్యానందం, మల్లిపూడి సాల్మన్ ఎంపీటీసీ సభ్యురాలు ముప్పిడి సరోజిని, బ్రదర్ మనోహర్ చింతపల్లి క్రీస్తుసంఘ సభ్యులు బోయజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులకు ప్రేమవిందు ఏర్పాటు చేసారు.

తేతలి సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి సొసైటీ మాజీ అధ్యక్షుడు కర్రి గణపతిరావు (48) గురువారం ఉదయం అకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య సత్యవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గణపతిరావు మృతి పట్ల రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గణపతిరావు భౌతికాయానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు చీర్ల రాధయ్య, గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతిప్రియ, ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు సరెళ్ల కృపావరం, కోట స్వామీజీ, సరెళ్ల సతీష్, అడ్డాడ శ్రీనివాసరాజు, నివాళులర్పించారు.

చీతిరాల సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం అర్బన్: చీతిరాల వెంకట రమణయ్య అందించిన సేవలు మరువలేనివని పట్టణ ప్రముఖులు పేర్కొన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో చీతిరాల సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. చాంబర్ అధ్యక్షుడు ఈతకోట భీమశంకరరావు (తాతాజీ) మాట్లాడుతూ ఐదున్నర దశాబ్దాలుగా వర్తకుల సంక్షేమానికి చీతిరాలవెంకట రమణ విశేషంగా కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా చీతిరాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి నాగేంద్రరెడ్డి, తంగెళ్ళ పేర్రాజు, జీవీఎం కృష్ణ, మండవల్లి నాగేంద్ర, నక్కా నాగేశ్వరరావు, సుభాష ప్రసాద్ తదితరులు పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం: పట్టణంలోని శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ వెంకటేశ్వరరావు కోరారు. గూడెం సౌత్ సెక్షన్ పెంటపాడు ఉప విద్యుత్ కేంద్రం నుంచి 11కెవి ఫీడరు కింద మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. గురువారం ఉదయం తొమ్మిదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కంచుమర్రు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను వైఎస్సార్‌సీపీ మండల రైతు విభాగం అధ్యక్షుడు పెన్మెత్స భాస్కర వెంకటపతిరాజు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తేలి శాంతి స్వరూప్, పంచాయతీ కార్యదర్శి జిభాస్కర్ పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను ప్రచురిస్తున్న పచ్చ మీడియా

తణుకు అర్బన్: దుష్ప్రచారాలను ప్రచురిస్తూ, సత్యాలను మరుగున పరుస్తూ ప్రజాస్వామ్యానికి, పత్రిక రంగానికి ఈనాడు మీడియా వ్యవస్థ గొడ్డలి పెట్టుగా మారిందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య అన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య మాట్లాడుతూ ప్రభుత్వంపై తప్పుడు కథనాలు వండి వడ్డిస్తూ అడ్డంగా దొరికిపోయి సవరణలు వేసుకోవాల్సిన దుస్థితి రామోజీకి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, డీజే అమూల్యారావు, జంగం ఆనంద్‌కుమార్, పుల్లెపు సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, ఝాన్సీ లారెన్స్, తాటిపర్తి వాసు, షేక్ బాజీ, పెరవలి రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ, రంభ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: జాతీయ మీడియా వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందిస్తుంటే, అందుకు విరుద్ధంగా పచ్చ మీడియా పచ్చకామెర్లతో రాష్ట్ర అభివృద్ధిని చూడలేకపోతుందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ చెప్పారు. తణుకు రూరల్ మండలం వేలూర్పులోని మంత్రి కారుమూరి ఆదేశాల మేరకు పీబీఆర్ గ్రౌండ్‌లో గురువారం వచ్చిన కథనాలను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, రెడ్డి హైమా, విజయ దుర్గ, శేషుకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





వేల్పూరు, ఇరగవరంలో ఈనాడు ప్రతులను దగ్ధం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇరగవరంలో : ఈనాడు రామోజీరావు తప్పుడు వార్తలు ప్రచురించడాన్ని నిరసిస్తూ ఇరగవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఈనాడు ప్రతులను దగ్ధం చేశారు. అడ్డదారులు తొక్కే రాచ గురువింద రామోజీ కుతంత్రాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని వైసీపీ నాయకులు విమర్శించారు.కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలా పాలేశ్వరరావు మంగెన రామానాయుడు, చవ్వాకుల శ్రీను, వెంకటరెడ్డి, సోడే జోషి, మామిడిశెట్టి శ్రీను, కుడిపూడి నాగసత్యనారాయణ, వీరవల్లి యుగంధర్, త్రిమూర్తులు, వీరవల్లి విఘ్నేశ్వరరావు, బొక్కా శ్రీను, జక్కంశెట్టి రాంబాబు, వీరవల్లి మోషేన్, శీలబోయిన శ్రీను, బొక్కా చినబాబు, గంధం ధనయ్య, జి సత్యనారాణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: తెదేపా నాయకుడు పట్టాభికి సంబంధించిన పాతపాటోలతో తప్పుడు వార్తలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు దినపత్రిక యజమాని రామోజీరావు హేయమైన చర్యలకు పాల్పడటం పత్రికా రంగానికి సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు అన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు క్యాంపు కార్యాలయం వద్ద ఈనాడు దిపత్రికలను తగులబెట్టారు. వెలనాటి సత్తిబాబు, చింతకాలయ సత్యనారాయణ, మేడపాటి జనార్ధనరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

గృహసారథులే గ్రామాభివృద్ధికి వారధులు

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లే గ్రామాభివృద్ధికి వారధులని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. గృహసారథులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరును అవగాహన చేసుకుని సమయపాలనతో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో మున్సిపాల్టీ పరిధిలోని వార్డుల గృహసారథులు, కన్వీనర్లకు శిక్షణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు మాట్లాడుతూ జగన్ రూపొందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు నూరుశాతం సఫలీకృతులయ్యారన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని గృహసారథులకు తెలిపారు. సంక్షేమం అవసరమైన వారికి పథకాలను వివరించి అవసరమైన వారికి అందించే విధంగా ముందుకు సాగాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మత పార్టీల రహితంగా సంక్షేమాన్ని అందిస్తుందని ఈవిషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని సూచించారు. నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన గృహసారథులకు భవిష్యత్తులో ఉన్నతస్థాయిని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని చెప్పారు. 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాలను మన వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకొనేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. విధి నిర్వహణలో శ్రమించిన వారందరికీ సముచిత స్థానం కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి కుటుంబానికి మూడు లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు లబ్ధి పొందారన్నారు. ఎన్నికల మానిఫెస్టోను తూ.చ తప్పకుండా అమలు చేసిన వైఎస్సార్‌సీపీ పార్టీకి ఎదురు నిలబడే ప్రతిపక్షాలు లేవన్నారు. విధి నిర్వహణలో ఎదుర్కొనే ఇబ్బందులను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిష్కరిస్తానని చెప్పారు. పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలకు ప్రజలకు కోట్ల రూపాయలు వెచ్చించి అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించామన్నారు. వైస్సార్‌సీపీని నియోజవర్గంలోని ప్రతి కుటుంబం ఆదరిస్తుందని గడపగడప కార్యక్రమంలో ప్రజలే స్వయంగా చెప్పడం సంతోషకరమన్నారు. ఆయా వార్డుల కన్వీనర్లు నాయకులు శ్రమించాలని కోరారు. ఈ శిక్షణా సమావేశంలో కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, గుండుబోగుల నాగు, వెలనాటి సత్తిబాబు, మానికొండ వెంకటేశ్వరరావు, బోణం విజయనిర్మల, పత్సమట్ల సావిత్రి, చామన సూర్యచంద్రరావు, తెన్నేటి జగ్జీవన్, మేడపాటి జనార్మదనరెడ్డి, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



గృహసారథులకు అవగాహన కల్పిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వీఆర్వోపై విచారణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం సచివాలయంలో ఇన్‌చార్జి వీఆర్వో ఆదాము రాజు విధి నిర్వహణలో మద్యం సేవిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ గురువారం విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు ఆయన తెలిపారు. తదుపరి ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తాడేపల్లిగూడెం రూరల్: వరిపై ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని నందమూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లో ఆయన వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ ఆకు ముడత, కాండం తొలుచు పురుగు నివారణకు కంకులు ఏర్పడక ముందు ఎనిమిది కిలోల కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు, కంకులు ఏర్పడిన తర్వాత కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు ఒక లీటరు నీటికి లేదా క్లోరాన్‌ట్రానిల్‌ప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోనేటి దానయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సీతయ్య, ఆర్‌బీకే ఇన్‌ఛార్జ్ జె.సతీష్, ఎం.ఆంజనేయులు, ఎ.భరత్ తదితరులు ఉన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

అత్తిలి: దాళ్వా ఈ పంట నమోదుకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియ ఈనెల 25తో ముగుస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. వేలిముద్రలు వేయని రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జ్ వద్ద ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ-క్రాప్ నందు ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్ముటకు, పంట నష్ట పరిహారం, సున్నావడ్డీ, క్రాఫ్ ఇన్సూరెన్స్ వర్తిస్తాయని తెలిపారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

తణుకు టౌన్: క్రమశిక్షణ, ఉన్నత లక్ష్య సాధనతో విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని ఉమ్మడి జిల్లా మానవత సంస్థ కేరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డా.కోడూరి రాధాపుష్పావతి చెప్పారు. గురువారం తణుకులోని ఎస్ఎన్‌వీటీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన కేరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీ నాగవేణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాధాపుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలపై దృష్టి కేంద్రీకరించి మంచి మార్కులు సాధించాలని కోరారు. మంచి ఆలోచనలతో మంచి సానుకూల దృక్పదాలను అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేరీర్ గైడెన్స్ సెల్ అధ్యక్షురాలు రాధాపుష్పావతిని కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక సిబ్బంది సత్కరించారు. ఈకార్యక్రమంలో మానవత అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు, సోమేశ్వరరావు, పీ వీరభద్రం, కర్రి భవానీ, శ్రీనివాసన్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కేరీర్ గైడెన్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాధాపుష్పావతి

పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తా

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బోడపాటి వీర్రాజును వైఎస్సార్‌సీపీ అనుబంద కమిటీ జిల్లా రైతు అధ్యక్షుడుగా నియమించారు. ఈమేరకు ఆయనకు గురువారం నియామక ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. మొదటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకుడుగా వున్న బోడపాటి వీర్రాజు గతంలో మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంద కమిటీలో ఆయనను జిల్లా రైతు అధ్యక్షుడుగా నియమించారు. ఈ సందర్భంగా పార్టీ తన పట్ల ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటూ పార్టీకి సేవలందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రంగనాథరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా రైతు అధ్యక్షుడుగా నియామకం పొందిన బోడపాటి వీర్రాజుకు ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్ కుమార్, పైడిపర్రు, మండపాక సొసైటీ అధ్యక్షురాలు వైవీ విజయామూర్తి, తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జిల్లా రైతు అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు (ఫైల్ ఫొటో)

నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఆకివీడులో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి పి.పూర్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఇటుకుల గుంట గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు మందులు, మద్యం మత్తులో మృగాళ్లు పసికందులపై సైతం అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలు కఠినంగా అమలు చేయకపోవడం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ, మండల కార్యదర్శులు బంకురు యశోద, పి.సత్యవతి, నాయకులు మహాలక్ష్మి, వెంకటనాగమణి, వెంకాయమ్మ, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

పెంటపాడు: పదోతరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు సమగ్రప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. వెంకటరమణ కోరారు. నియోజకవర్గస్థాయిలో ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్‌తో పాటు, 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ యాప్‌పై పూర్తి అవగాహన కల్పించే విధంగా ప్రాథమిక, ప్రాథమికొన్నత స్థాయి ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన సదస్సు డీవైఈవో అధ్యక్షతన గురువారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యావిధానానికి సంబంధించి అమలు చేస్తున్న పలు పథకాల అమలు తీరుపై విద్యాశాఖ తనిఖీలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అకడమిక్ విషయాలు అభివృద్ధితో పాటు, అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచుకొనేందుకు వీలుగా ఉపాధ్యాయులు బోధన సాగాలన్నారు. డీవైఈవో రవీంద్రబారతి మాట్లాడుతూ నాడు- నేడు పనులపై నిర్లక్ష్యం విడనాడాలన్నారు. నియోజకవర్గ హైస్కూలు, ప్రేమరీ ఉపాధ్యాయులు సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది, వెల్ఫేర్ సిబ్బందితో నాడు-నేడు పథకం అమలు తీరుపై చర్చించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లు ఎం. శ్రీనివాస్, వి. హనుమలతో పాటు, స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎంలు 157 మంది, 80 మంది ఇంజనీరింగ్, వెల్ఫేర్ సహాయకులు పాల్గొన్నారు.



డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డీఈవో వెంకటరమణ

తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: జీవిత బీమాపై తపాలశాఖ ఏర్పాటు చేసిన పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గూడెం తపాలశాఖ పోస్టల్ సూపరెండెంట్ సీవీ రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఫిబ్రవరి 20 నుంచి 24 వరకు తపాలశాఖ మహామేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల వినియోగార్థం పొదుపు పథకాల వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిందన్నారు. సుకన్య సమృద్ధి, పీఎఫ్, సిటిజన్ సేవింగ్ స్కీం, జాతీయ పొదుపు పథకాలు ఇలా పలు పథకాల వల్ల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కేవలం రూ. 399కే రూ. 10లక్షల బీమా వర్తిస్తుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం సొసైటీ ఆవరణలో ఈ నెల 26వ తేదిన ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. తొలుత శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత కొట్టు విశాల్ ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం యూనియన్ ఆసుపత్రి వైద్యులు గుండె, ఎముకలు, నరాలు, చిన్నపిల్లలు, ఇతర సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. గ్రామ, పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని సొసైటీ చైర్మన్ నరేంద్రకుమార్ కోరారు.

వాసవీలో నేషనల్ ఈ కాన్ఫరెన్స్

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్, డెవలప్‌మెంటు విభాగం ఆధ్వర్యంలో డేటా ఇంజనీరింగ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అనే అంశంపై ఈ నెల 24, 25 తేదీల్లో జాతీయ ఈ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్టు పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు తెలిపారు. దేశంలోని సుప్రసిద్ధ సంస్థల నుంచి ప్రొఫెసర్లు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. విద్యార్థులు ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు

- గంజాయి వినియోగిస్తున్న వారిని హెచ్చరించిన జిల్లా ఎస్పీ రవిప్రకాష్
- కుటుంబ సభ్యులకు తణుకులో కౌన్సెలింగ్

తణుకు: జిల్లాలో గంజాయి వాసన రానివ్వబోనని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ స్పష్టం చేశారు. గంజాయి విక్రయిస్తున్న వారి ద్వారా వినియోగిస్తున్న వారిని గుర్తించి వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. తణుకు పరిసర ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్న వారి జాబితాను సేకరించి వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ రవిప్రకాష్ గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున గంజాయి తీసుకువచ్చి స్థానికంగా విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో నిఘా ఉంచామన్నారు. అరెస్టు చేసిన వారి ద్వారా సేకరించిన సమాచారంతో జాబితా తయారు చేశామన్నారు. కేవలం 2 నెలల వ్యవధిలోనే 94 మందిని అరెస్టు చేశామని గుర్తు చేశారు. వీరి సెల్‌ఫోన్ల ద్వారా వచ్చిన సమాచారంతో గంజాయి వినియోగిస్తున్న వారిని గుర్తిస్తున్నట్లు చెప్పారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి సన్మార్గంలో నడిచేలా పరివర్తన తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు భీమవరం, నరసాపురం ప్రాంతాల్లో కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు ఆయా కేంద్రాల ద్వారా 110 మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. గంజాయి కొద్దిమొత్తంలో కొనుగోలు చేసి వినియోగిస్తున్నవారే పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు చేసే స్థాయికి చేరుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో వినియోగించేవారికి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రవర్తనలో మార్పు రాకపోతే అరెస్టు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, రూరల్ ఎస్సై కె.గుర్రయ్య, పాల్గొన్నారు.



గంజాయి వినియోగిస్తున్న వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్